అభివృద్ధికి జంక్షన్

రూ.15 కోట్లతో హనుమాన్ జంక్షన్ అభివృద్ధి



హనుమాన్‌జంక్షన్‌లో నూతన బస్‌స్టేషన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో హనుమాన్‌జంక్షన్ పట్టణంలో మౌలిక సదుపాయాలు శరవేగంగా అభివృద్ధి చెందాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన హనుమాన్‌జంక్షన్ 16వ నంబర్ జాతీయ రహదారి, 216 హెచ్ జాతీయ రహదారుల కూడలి ప్రాంతం కావటం, రైల్వే రవాణా సదుపాయాలు కలిగి ఉండటం, గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో పారిశ్రామికంగానూ దూసుకువెళ్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రాధాన్యత కలిగిన హనుమాన్‌జంక్షన్‌లో రూ.15 కోట్ల వ్యయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిలువెత్తు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

రూ.4.40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్..

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హనుమాన్‌జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. 1966లో నిర్మించిన బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రూ.4.40 కోట్ల వ్యయంతో హనుమాన్‌జంక్షన్ నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు బస్టాండ్లను అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఇంటిగ్రేటెడ్ స్టేషన్లుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన కార్యాచరణలో భాగంగా హనుమాన్‌జంక్షన్‌ను కూడా ఎంపిక చేసింది. సుమారు 1.23 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ నూతన భవన సముదాయాలను నిర్మించనుండగా, హైవేకు అనుకుని ఉన్న 20,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యాపార, వాణిజ్య సముదాయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రోజుకు దాదాపు 1000కుపైగా బస్సుల రాకపోకలు, 5 వేల మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ బస్‌స్టేషన్ బహుళ ప్రయోజన కేంద్రంగా రూపుదిద్దుకుంటుంది.

ఆధునిక సదుపాయాలతో పీహెచ్‌సీ

స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లో రూ.1.40 కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 24 గంటల వైద్య సేవల ఆస్పత్రిగా గుర్తింపు పొందిన పీహెచ్‌సీలో ఆధునిక హంగులతో సకల సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే 85 శాతంపైగా నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. రిసెప్షన్, ఓపీ విభాగం, ఆధునిక సదుపాయాలతో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఫార్మసీలతో పాటుగా స్త్రీ, పురుష రోగుల కోసం ప్రత్యేక వార్డులు ఈ భవనంలో ఏర్పాటు చేశారు.

సర్కార్ బడికి సరికొత్త హంగులు..

స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ స్కూల్‌ను రూ.1.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. గతంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రజాప్రతినిధులు, విరాళాల కోసం దాతల చుట్టూ గ్రామస్తులు, ఉపాధ్యాయులు తిరిగిన పరిస్థితులు ఉండేవి. నేడు పూర్తిగా ప్రభుత్వ నిధులతో కార్పొరేట్ హంగులకు మించి జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలను కల్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో నాబార్డు సాయంతో రూ.80 లక్షల వ్యయంతో ఎనిమిది తరగతి గదులు, టాయిలెట్లు నిర్మాణం చేయగా, రెండో విడతలో రూ.50 లక్షల వ్యయంతో డిజిటల్ తరగతి గది, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరం నుంచి బాలికల జూనియర్ కళాశాలను కూడా ప్రారంభించింది.

రహదారులకు సరికొత్త కాంతులు..



హనుమాన్‌జంక్షన్‌లో నిర్మాణంలో డ్రైనేజీ పనులు

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో రూ.2.04 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడరోడ్డు, ఏలూరు రోడ్డు, గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో కలిపి మొత్తం ఆరు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ ఈ మేరకు పనులు ప్రారంభించింది. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు మరమ్మతులు చేయటంతో పాటుగా రూ.25.78 లక్షల వ్యయంతో ప్రధాన రహదారుల మధ్యలోని డివైడర్‌పై స్టీల్ రైలింగ్ నిర్మించనున్నారు. హనుమాన్‌జంక్షన్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్పు చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ రూ.81.50 లక్షలతో ప్రణాళిక చేపట్టింది.

రూ.2.8 కోట్లతో నూతన ప్రాంగణం..



హనుమాన్‌జంక్షన్ సీఐ కార్యాలయం

దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతున్న కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు హనుమాన్ జంక్షన్ బ్రాంచ్‌కు కొత్త భవనం ఏర్పాటు చేశారు. దీని కోసం విజయవాడరోడ్డులో రూ.1.53 కోట్ల వ్యయంతో 17.50 సెంట్ల స్థలాన్ని కేడీసీసీబీ కొనుగోలు చేసింది. మరో రూ.1.27 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణాన్ని కూడా శరవేగంగా పూర్తి చేశారు. ఇటీవల నూతన ప్రాంగణంలోకి కేడీసీసీబీ శాఖను మార్పు చేశారు. దాతల విరాళాలతో రూ.50 లక్షల వ్యయంతో హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని కూడా నిర్మించారు.



కేడీసీసీ బ్యాంక్ హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ నూతన భవనం

శ్రీహర్షకు ఉత్తమ సేవ అవార్డు



శ్రీహర్షకు అవార్డు అందజేస్తున్న అయ్యప్ప

భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ భవానీపురానికి చెందిన పీవీకె శ్రీహర్షకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ పక్షాన సేవలు అందిస్తున్న పలువురికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ.. మానవ హక్కులకు సంబంధించి ఎవరైనా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్న తమ సంస్థ ప్రతినిధుల సేవలను గుర్తించి ప్రోత్సాహకరంగా అవార్డులను అందచేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులకు భంగం కల్పించిన ఘటనలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాదులు రమణ కోటేశ్వరరావు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టి గారి పార్కు ప్రాంతంలో శ్రీను కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనుకు ముగ్గురు సంతానం. కుమార్తె 7వ తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల వారిని ఆరా తీయగా ఓ ఆటోలో వెళ్లినట్లు చెప్పడంతో ఆందోళన చెందిన శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో విజయరాజరాజేశ్వరి, శ్రీవిజయ సుందరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తొలుత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కాకినాడ నుంచి వచ్చిన సత్కలవాహిని బృందం సభ్యులు ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు.

రెండు కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 17 నుంచి ప్లంబింగ్, శానిటరి ఫిట్టింగ్, కార్ రిపేర్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య వయసు ఉన్నావారు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తారని వివరించారు. శిక్షణ పూర్తి ఉచితమని ఆసక్తి కలవారు 95050 12312 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



గన్నవరం: విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవార్చుకోవాలని విశ్రాంత హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు సూచించారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా హాజరైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ..గ్రంథాలయాల్లోని అమూల్యమైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీసం వారంలో ఒక రోజైన గ్రంథాలయాలను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథాలయ సిబ్బందిని ఆయన అభినందించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి.బాబూరావు, పలువురు సిబ్బంది పి. దుర్గలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం సాధ్యమని, కావున మాంసాహారం మానుకుని శాఖాహారం తీసుకోవాలని విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు చెన్నకేశవరావు అన్నారు. స్థానిక చుట్టుగుంటలో ఆదివారం విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యాన శాఖాహారం తీసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డుతో సహా మాంసాహారం తినడం వల్ల 159 రకాల రోగాలు వస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని అన్నారు. మానవులు ఆచరించాల్సిన అత్యంత ఉదాత్తమైన, మహోన్నతమైన ధర్మం అహింస అని పేర్కొన్నారు. ప్రపంచ మేధావులంతా శాఖాహారులేనని జీవహింస మానుకోవాలని సూచించారు. అనంతరం జీవహింస మానుకోవాలని, శాఖాహారమే తీసుకోవాలని నినాదాలు చేస్తూ చుట్టుగుంట, దుర్గాపురం తదితర ప్రాంతాల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి కుంకుమార్చనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు, శ్రీచక్రార్చన, విశేషంగా అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

పేదలకు సాయం చేయడమే బక్రీద్



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాగుల్‌మీరా, తదితరులు

నున్న(విజయవాడరూరల్): పేదలకు సహాయం చేయడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఏపీ 31వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని నున్న టీచర్ కాలనీ మక్కామసీద్ వద్ద పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఆర్థికపరమైన సంతోషాలతో ఉన్న కుటుంబాలు బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, అదే పేదలకు సహాయం చేయడమన్నారు. మనతో పాటు పేద కుటుంబాలను సహాయం చేసి ఆదుకోవడమే ఆజాద్ ముస్లిం కమిటీ విధానమన్నారు. ప్రతి నెలా ఒక్కొక్క నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నవారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, గన్నవరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మస్తాన్ వలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ రహీం, నున్న గ్రామ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్, కార్యదర్శి సుభాని, సెంట్రల్ నియోజకవర్గం కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన ఆర్ఎస్‌వై.రాజేశ్వరికి చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన చిన్నారులు ఆంధ్ర నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉపాధికి ఊతం

- ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం
- మూడేళ్లపాటు మెయింటెనెన్స్‌కు నగదు

గన్నవరం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతగానో మేలు చేస్తోంది. ఈ పథకం ఉద్యాన పంటల సాగుకు ఊతమిస్తోంది. మండలంలో మొత్తం 21 గ్రామాలు ఉండగా వాటిలో 15 మెట్ట ప్రాంత గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మామిడి, జామ, నిమ్మ, కొబ్బరి వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

ఎవరు అర్హులంటే..

ఐదు ఎకరాల మెట్ట లేదా 2.5 ఎకరాలు మాగాణి భూమి కలిగి ఉన్న రైతులు ఈ ఉపాధి పథకం ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. వీరికి పథకం ప్రయోజనాలు పొందాలంటే జాబు కార్డు ఉండాలి. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీతో ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేయించుకుంటే టెక్నికల్ అసిస్టెంట్ వారికి పథకం ప్రయోజనాలు అందే విధానం వివరిస్తారు. వారికి మూడు సంవత్సరాల పాటు ఆయా రకాల పంటల సాగుకు వచ్చే ప్రయోజనాలను తెలియజేస్తారు.

మూడేళ్లు మెయింటెనెన్స్‌కు నగదు..

ఉదాహరణకు మామిడి మొక్కలు సాగు చేసే రైతులకు మూడు సంవత్సరాల పాటు వాటి మెయింటెనెన్స్‌కు నగదును ప్రతి నెలా అందిస్తారు. 66 మొక్కలు సాగు చేసిన రైతులకు మొక్కల కొనుగోలుకు బిల్లు ప్రకారం నగదు, పథకం ద్వారా నెలకు రూ.900, 50 మొక్కలు సాగు చేసిన వారికి నెలకు రూ.725, 25 మొక్కలు సాగు చేసిన రైతుకు రూ.290 ఇప్పటికే పలు గ్రామాల్లో పథకం ద్వారా అందజేస్తున్నారు. మొక్కల కొనుగోలుకు, గుంత తవ్వేందుకు, నెలనెలా నీరు పోసి మొక్క పెంచేందుకు మూడు సంవత్సరాల పాటు పథకం నగదును రైతులకు అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఉద్యాన పంటలు సాగు చేసే వారు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.



మాదలవారిగూడెంలో మామిడి మొక్కను నాటేందుకు గుంతను తవ్వుతున్న రైతు (ఫైల్)

నీటి కుంటతో ప్రయోజనం..



సూరంపల్లిలో నీటి కుంటను తవ్వుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

మండలంలోని గ్రామాల్లో 36 నీటి కుంటలను ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఇప్పటికే తవ్వించుకుంటున్నారు. ఒక మీటరు లోతు, 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో నీటి కుంట తవ్వకానికి పథకం కింద రూ.40 వేలు చెల్లిస్తారు. ఈ నీటి కుంటల వల్ల పంట భూముల్లో తేమశాతం పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. నీటి నిల్వ కారణంగా వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులు ఈ నీటిని పంటలు ఎండిపోకుండా ఉపయోగించుకుంటారు. భూమిలో సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది అధిక దిగుబడులు రావటం ద్వారా రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందుతారు. రైతులు నీటి కుంటలు తవ్వకునేందుకు ముందుకు రావాలని ఉపాధి పథకం అధికారులు కోరుతున్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) 78వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మండవ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిలర్లు అలహరి శ్రీనివాసమూర్తి, యు. టైటస్‌పాల్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణమోహన్, అక్కినేని సత్యవంతు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల అధ్యక్షులు కె.పిచ్చేశ్వరరావు, పచ్చిగళ్ల సురేష్‌బాబు, మిశ్రా, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు అబ్దుల్ కాలిక్, పి.సాంబశివరావు, రఘు, మాధవరావు, యోగానందరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధం



గంగూరు రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు

పెనమలూరు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండల పరిధిలో దాదాపు ఆరున్నర వేల ఎకరాలు రైతులు వరి సాగు చేస్తారు. ఇక్కడ వరి పండించే పొలాలకు అనుగుణంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు వచ్చాయి. క్వింటా వరి విత్తనాలకు రూ.500 సబ్సిడీ ఉంది. కేజీ వరి విత్తనాలు సబ్సిడీ పోను రూ.34.80 వంతున రైతులకు ఇస్తారు. మండలానికి వరి విత్తనాలు 140 క్వింటా కావాల్సి ఉండగా ప్రస్తుతం 1318 రకం 60 క్వింటాళ్లు, 1061 రకం వరి విత్తనం 70 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. రైతులకు మరిన్ని వరి విత్తనాలు అవసరమైతే తెప్పించి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు సకాలంలో వరి విత్తనాలు తీసుకొని సాగుకు సమాయత్తం కావాలని కోరారు.

వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అల్లర్లు, వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ చేసేందుకు కూడా వెనకాడమన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించకుండా మీ జీవితాలను మీ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపుకోవాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను పేరుపేరున ఆరా తీయడంతో పాటు వారి దిన చర్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించినా, స్థానికంగా ఎటువంటి వివాదాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట సీఐ గణేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు దీవెన ఫౌండేషన్ చేయూత



భవానీపురం(విజయవాడపశ్చిమ): పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైన 65 సంవత్సరాల వృద్ధుడి కుటుంబానికి దీవెన ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు, నగదు అందించి చేయూత ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో మచ్చ తాతారావు(65)కు పక్షవాతం వచ్చి గత కొన్ని నెలలుగా మంచానికి పరిమితమై దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు సాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున గ్రూప్ సభ్యులు పెనమలూరు హెడ్ కానిస్టేబుల్ తరుణ్, రవి ఆదివారం వారి ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, వారి మందుల ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ.. విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామన్నారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకుని తోటివారికి సాయం చేయాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ సూచించారు. దుర్గాపురానికి చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వీరంకి గోకర్ణేశ్వరరావు ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లభించదని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన గోకర్ణేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, జోన్ కార్యదర్శి గుర్రం ఏడుకొండలు, రాజారావు, ఆశ్రమ నిర్వాహకులు దుర్గ, జ్ఞానేంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.